TGTEL/26/A4015

తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 29 గురువారం అక్టోబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 169 తెలుగువారి పత్రిక..... మీ కోసం

రిపోర్టర్లు కావలెను

తెలంగాణ మంజీరా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న

తెలంగాణ మంజీరా

మీకు సరైన వేదిక... అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.

98496 38320

ప్రభుత్వ సేవల్లో ఏఐ: తెలంగాణలో

'ఏఐ సాక్షమ్'

కార్యక్రమం ప్రారంభం



-'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మల్లు భట్టి విక్రమార్క

-రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలన్న డిప్యూటీ సీఎం

-ప్రజల డేటా భద్రత పాధాన్యమని వెల్లడి

02

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు..

కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?

02

మోదీ సెటైర్

-నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు

-12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం

-ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరిగాయని గుర్తుచేసిన ప్రధాని మోదీ

-మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్

ఇజ్రాయెల్ ఎన్నికల్లో హంగ్

నెతన్యాహుకు షాక్.. ప్రతిపక్షాలదే స్వల్ప పైచేయి

అక్టోబర్-28 తెలంగాణ మంజీరా

హమాస్ దాడుల తర్వాత ఇజ్రాయెల్‌లో తొలిసారిగా జరిగిన జాతీయ ఎన్నికల్లో హోరాహోరీ పోరు నెలకొంది. మంగళవారం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు "హంగ్" వాతావరణాన్ని సూచిస్తున్నాయి. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని కూటమి, మాజీ సైన్యాధిపతి గాడి ఐసెన్‌కోట్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి మధ్య నువ్వానేనా అన్నట్లుగా పోటీ నడిచింది. అయితే, ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 61 సీట్ల మ్యాజిక్ ఫిగర్‌ను ఏ కూటమీ సాధించలేకపోయిందిప్రతిపక్ష కూటమికి 52 నుంచి 53 స్థానాలు లభించే అవకాశం ఉంది. మరోవైపు, నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ, ఇతర మిత్రపక్షాలతో కూడిన కూటమికి సుమారు 50 స్థానాలు దక్కవచ్చని అంచనాలు వెలువడ్డాయి..... మిగతా 2 లో

'ప్రతిచోటాదెయ్యాలే కనిపిస్తున్నాయా?'..

రాహుల్‌కు నిర్మల ఘాటు కౌంటర్

అక్టోబర్-28 తెలంగాణ మంజీరా

టాటా గ్రూప్ వ్యవహారం ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతోంది. ఆ సంస్థనుఉద్దేశపూర్వకంగాదెబ్బతీస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఘాటుగా స్పందించారు. ప్రతి అంశాన్నీ రాజకీయ కోణంలో చూడొద్దని, వాణిజ్య, న్యాయపరమైన విషయాలను నేరాలుగా చిత్రీకరించడం సరికాదని హితవు పలికారు...... మిగతా 2లో...

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల

జాబితాపై

బండి సంజయ్ విమర్శలు

అక్టోబర్-28 తెలంగాణ మంజీరా

కరవు మండలాల జాబితా అశాస్త్రీయమన్న బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపణ35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా విస్మరించారని ఆగ్రహంతెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం.. యథాతథ స్థితి

కొనసాగించాలన్న హైకోర్టు

-ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు తాత్కాలిక ఊరట

-ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు కోర్టు నోటీసుల జారీ

-కేసు తదుపరి విచారణ నవంబర్ 6కు వాయిదా

అక్టోబర్-28 తెలంగాణ మంజీరా

ఫార్ములా ఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన పాస్‌పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది.

టాటా గ్రూప్‌ను

నాశనం చేస్తున్నారు

మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్

-టాటా గ్రూప్‌ను నేరపూరితంగా నాశనం

-చేస్తున్నారన్న రాహుల్ గాంధీ

-మోదీ, అమిత్ షాలపై తీవ్ర విమర్శలు

-భయంతోనే వ్యాపారవేత్తలు మౌనంగా ఉన్నారని ఆరోపణ

2లో

ఏపీకి మరో 7 రోజుల పాటు

భారీ వర్ష సూచన

అర్నబ్ తుపానుతో ఇప్పటికే కుండపోత..

02

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

సర్కార్‌పై ధ్వజం

కాంగ్రెస్ హరీశ్ రావు

అక్టోబర్-28 తెలంగాణ మంజీరా

మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నమూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారుహైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు.ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మిగతా 2లో

ప్రభుత్వ సేవల్లో ఏఐ: తెలంగాణలో

మొదటిపేజీ తరువాయి

అక్టోబర్-28 తెలంగాణ మంజీరా

తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం యొక్క ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, పింఛనుదారులు వంటి వారు పదేపదే ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితికి చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయా లేదా అనే విశ్లేషణ, విద్యుత్ డిమాండ్ అంచనా వంటి పనులకు ఏఐ ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. అదే సమయంలో ఏఐ వినియోగంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి అని భట్టి నొక్కిచెప్పారు. ఏఐ అందించిన సమాచారాన్ని అధికారులు కచ్చితంగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తామని, ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. చిన్నస్థాయి ప్రయోగాలు విజయవంతమైన తర్వాతే ఏఐ వ్యవస్థలను విస్తరించాలని, ఏవైనా లోపాలు జరిగితే బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని అన్నారు. ప్రజలకు అందే వేగవంతమైన, పారదర్శక సేవలే ఏఐ విజయానికి గీటురాయి అవుతాయని ఆయన పేర్కొన్నారు.

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

అక్టోబర్-28 తెలంగాణ మంజీరా

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ టాటా గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. టాటా సంస్థను 'నేరపూరితంగా నాశనం' చేస్తున్నారని, అయినా దేశంలోని వ్యాపారవేత్తలు భయంతో నోరు మెదపడం లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు. "భారతీయ వ్యాపార రంగం మోదీ, అమిత్ షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, మాకుంది. ఈ నేరాలకు న్యాయం జరిగేలా చూస్తాం" అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. టాటా గ్రూప్‌లో కొంతకాలంగా నడుస్తున్న అంతర్గత వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామకాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాలు చేశారు. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు తీర్మానం చెల్లదని, నియామక ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని ఆయన అక్టోబర్ 26న రాసిన లేఖలో ఆరోపించారు. ఈ వివాదం కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, రాహుల్ ఆరోపణలపై బీజేపీ నేత సీఆర్ కేశవన్ స్పందించారు. రాహుల్ గాంధీకి ఆర్థికశాస్త్రంపై అవగాహన లేదని విమర్శించారు.

జెడ్పీహెచ్ఎస్ అల్లీపూర్‌లో ఈ-వేస్ట్‌పై అవగాహన

తెలంగాణ మంజీరారాయికల్ అక్టోబర్ 28:

రాయికల్ మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ-వేస్ట్ నిర్వహణ, వ్యర్థాల వేరు సేకరణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం, క్విజ్ పోటీలు నిర్వహించారు. సమగ్ర శిక్ష అభియాన్ ఎస్పీడీ ఆదేశాలు, జిల్లా విద్యాశాఖ సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి కె. రాము ముఖ్య అతిథిగా హాజరై, ఈ-వేస్ట్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సురక్షితంగా తొలగించే విధానాలపై విద్యార్థులకు వివరించారు. పాఠశాలలో తడి చెత్తకు ఆకుపచ్చ, పొడి చెత్తకు నీలం, శానిటరీ వ్యర్థాలకు గులాబీ/ఎరుపు, ఈ-వేస్ట్‌కు నలుపు రంగు డబ్బాలను ఏర్పాటు చేసి వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, రాయికల్ ఎంఈఓ రాఘవులు, ప్రధానోపాధ్యాయుడు కిరణ్, ఈ-వేస్ట్ కోఆర్డినేటర్ రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

-అమృత్, మిషన్ భగీరథ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని చైర్మన్ సూచన

-వీధి దీపాల సమస్యల పరిష్కారంపైనా కౌన్సిల్‌లో చర్చ

తెలంగాణ మంజీరారాయికల్, అక్టోబర్ 28:

రాయికల్ పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి, నీటి సరఫరాను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ అధికారులకు సూచించారు. బుధవారం రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో పట్టణంలోని పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా నీటి కొరత తీవ్రంగా ఉన్న 9, 10, 11వ వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చైర్మన్ సూచించారు. ఇందుకోసం అమృత్ ప్రాజెక్టు, మిషన్ భగీరథ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కార్యాలయ ఇంజనీర్‌కు సూచించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అమృత్ ప్రాజెక్టు కింద చేపట్టిన నీటి సరఫరా పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని కౌన్సిలర్లు కోరారు. అదేవిధంగా పట్టణంలోని శ్మశానవాటికకు వెళ్లే దారి, రామాజీపేట రోడ్డులో నెలకొన్న వీధి దీపాల సమస్యను కౌన్సిలర్లు సమావేశంలో ప్రస్తావించారు. ఈ సమస్యలను విద్యుత్ శాఖ ఏఈ నవీన్ దృష్టికి తీసుకెళ్లి, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి. మనోహర్, వైస్ చైర్‌పర్సన్, నాలుగో వార్డు కౌన్సిలర్ తురగ సౌజన్య, ఒకటో వార్డు కౌన్సిలర్ తోపారపు ప్రశాంతి, మూడో వార్డు కౌన్సిలర్ భుక్యా రాకేష్ నాయక్, ఐదో వార్డు కౌన్సిలర్ కూనారపు మానస, ఆరో వార్డు కౌన్సిలర్ వేముల మౌనిక, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బత్తిని మహేశ్వరి, పదో వార్డు కౌన్సిలర్ మచ్చ గంగలక్ష్మి, పదకొండో వార్డు కౌన్సిలర్ పుర్రె శ్రీధర్, కోఆప్షన్ సభ్యులు వల్లకొండ మహేష్, సుదవేని లత, ఇంత్యాజ్ పర్వీన్, విద్యుత్ ఏఈ నవీన్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ ఎన్నికల్లో హంగ్

మొదటిపేజీ తరువాయి

నెతన్యాహుకు షాక్.. ప్రతిపక్షాలదే స్వల్ప పైచేయి

ఈ ఎన్నికల్లో అరబ్ పార్టీలు అనూహ్యంగా పుంజుకున్నాయి. గతంలో 10 సీట్లు గెలుచుకున్న ఈ పార్టీలు, ఈసారి 17 నుంచి 18 స్థానాలు సాధించవచ్చని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. ప్రభుత్వ ఏర్పాటులో ఈ పార్టీలు కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. పార్టీల వారీగా చూస్తే, నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ 24–25 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించే సూచనలు కన్పిస్తున్నాయి. ఐసెన్‌కోట్ కొత్తగా స్థాపించిన యషార్ పార్టీకి 21–23 స్థానాలు, నఫ్తాలి బెన్నెట్ పార్టీకి 12–14 స్థానాలు రావొచ్చని అంచనా. హమాస్ దాడుల తర్వాత నెతన్యాహు నాయకత్వంపై రిఫరెండంగా ఈ ఎన్నికలను భావించారు. రికార్డు స్థాయిలో 77.7 శాతం పోలింగ్ నమోదైంది. గత రెండు దశాబ్దాల్లో ఇదే అత్యధికం. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై ప్రతిపక్ష నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఇది నెతన్యాహు ప్రభుత్వంపై ప్రజల అవిశ్వాసానికి నిదర్శనమని ఐసెన్‌కోట్ వ్యాఖ్యానించగా, నెతన్యాహు కూటమికి ఇది ఘోర పరాజయమని ప్రతిపక్ష నేత యైర్ లాపిడ్ అన్నారు. అరబ్ పార్టీల నేతలు తమ ఫలితాలను "చరిత్రాత్మక విజయం"గా అభివర్ణించారు. ఈ ఫలితాల నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ వారాల తరబడి కొనసాగే అవకాశం ఉంది. అధికారికంగా పూర్తి ఫలితాలు వెలువడటానికి మరికొన్ని రోజులు పట్టవచ్చు. అనంతరం, ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపి, ప్రభుత్వ ఏర్పాటుకు ఒక నేతను ఆహ్వానిస్తారు. ఈ ప్రక్రియకు 42 రోజుల వరకు సమయం పట్టవచ్చు. అప్పటివరకు నెతన్యాహు తాత్కాలిక ప్రధానిగా కొనసాగే అవకాశం ఉంది.

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై

ఈ జాబితా అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో ఉందని ఆయన ఆరోపించారు. కేవలం మొక్కుబడిగా ఈ జాబితాను తయారు చేశారని మండిపడ్డారు. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బండి సంజయ్ అన్నారు. 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని తీవ్ర కరవు పరిస్థితులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పంట పొలాలు బీళ్లుగా మారినా, ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నష్టపరిహారం ఖర్చులు తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే కరీంనగర్‌ను ఉద్దేశపూర్వకంగా విస్మరించారా? అని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులతో మాట్లాడితేనే కరవు తీవ్రత స్పష్టంగా తెలుస్తుందని సూచించారు. కరవు మండలాలను ఏ ప్రాతిపదికన, ఏ గణాంకాల ఆధారంగా గుర్తించారో తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూమిలో తేమ వంటి అంశాలను విడివిడిగా పరిశీలించి, అర్హులైన అన్ని మండలాలను జాబితాలో చేర్చాలని కోరారు. ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ఏపీకి మరో 7 రోజుల పాటు

అర్నబ్ తుపానుతో ఇప్పటికే కుండపోత..

అక్టోబర్-28 తెలంగాణ మంజీరా

అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో కుండపోత వానలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రానికి మరో ఏడు రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం, కోస్తాంధ్ర, యానాంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. తీరం వెంబడి గంటకు 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి తీర ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తుపాను పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉందని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. మరోవైపు, రాయలసీమలో రాబోయే నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

మొదటిపేజీ తరువాయి

మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరపున డిమాండ్ చేశారు.

'ప్రతిచోటాదెయ్యాలే కనిపిస్తున్నాయా?'..

మొదటిపేజీ తరువాయి

టాటా వ్యవహారంపై రాహుల్ గాంధీ ఆరోపణలురాహుల్‌కు నిర్మలా సీతారామన్ కౌంటర్ ప్రతిచోటా దెయ్యాలను వెతకొద్దంటూ చురకలువ్యాపార అంశాలను రాజకీయాల్లోకి లాగొద్దని హితవుకాంగ్రెస్ లైసెన్స్-కోటా విధానంపై విమర్శలు టాటా గ్రూప్ తీవ్ర సంక్షోభంలో ఉందని, ఆ సంస్థను నేరపూరితంగా నాశనం చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారంపై వ్యాపార ప్రముఖులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. తమ దాకా వస్తే గానీ తెలియదా? అంటూ విమర్శించారు. భారత వ్యాపార రంగం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల్లోని ఆటబొమ్మ కాదని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన నిర్మలా సీతారామన్.. భారత పరిశ్రమలు, పారిశ్రామికవేత్తల విజయాలను కాంగ్రెస్ పదేపదే తక్కువ చేసి చూపుతోందని విమర్శించారు. వ్యాపార రంగంలో అవిశ్వాసం, విషపూరిత వాతావరణం వ్యాప్తి చేసేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారా? అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ పాలనలోని లైసెన్స్-కోటా విధానం పారిశ్రామికవేత్తల స్వేచ్ఛను దెబ్బతీసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్లపాటు కొనసాగించాలన్న నిర్ణయంపై వివాదం నెలకొంది. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాల్ చేశారు. ఆ నిర్ణయం చెల్లదని, నిబంధనల ప్రకారం జరగలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఓట్లు పోయాయని గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్.. ఆధారాలు చూపించండి..!

అవినీతి, కుట్ర రాజకీయాలకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్

అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ రాజకీయాలు

తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం

ఈవీఎంలను తెచ్చిందే కాంగ్రెసే...అదే ఈవీఎంలతో రెండుసార్లు అధికారంలోకి

సీఎం సొంత ఊరు కొండారెడ్డిపల్లికి వెళ్దాం..!

ఎస్.ఐ.ఆర్ అంటే రాజ్యాంగ హక్కు..!

సింగూరు జలాలు సంగారెడ్డి ప్రాంత ప్రజల హక్కు..!

మెదక్ ఎంపీ రఘునందన్ రావు

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్:

కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులపై ఎదగాలని చూస్తోందని, తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ తెలంగాణలో, సంగారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు ఎందుకు ధర్నాలు చేస్తున్నారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని రఘునందన్ రావు పేర్కొన్నారు. కొత్త ఓటర్ల పేర్లను చేర్చడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓట్లు కలిగి ఉన్నవారిని గుర్తించడం వంటి అంశాల కోసం ఈ ప్రక్రియ చేపడతారని వివరించారు. పదేళ్లకోసారి ఓటర్ల జాబితాను సవరించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఓట్లు తొలగిపోయాయని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు, అసలు ఎంతమంది ఓట్లు కోల్పోయారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎవరికైనా ఓటు హక్కు తొలగిపోతే ఫారం-6 నింపి సంబంధిత అధికారులకు సమర్పించడం ద్వారా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దీనిపై పెద్దఎత్తున ఆందోళనలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ ముఖ్యమంత్రి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి వెళ్లి, పోలీసుల సమక్షంలో ప్రతి ఇంటిలో ఓటు హక్కు కోల్పోయిన వారి వివరాలను పరిశీలించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ప్రభుత్వ అధికారులే బూత్ స్థాయి అధికారులుగా (బీఎల్‌వోలుగా) వ్యవహరిస్తున్నారని, వారు ఏదైనా రాజకీయ పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు నిరూపించగలరా అని ప్రశ్నించారు. జహీరాబాద్ ఎంపీ కుటుంబానికి చెందిన వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎన్నికల్లో గెలవలేక, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న ఆదరణను ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు ఓటు చోరీ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వాలు కూడా ఈవీఎంల ద్వారానే ఎన్నికల్లో విజయం సాధించాయని గుర్తుచేశారు. ఇప్పుడు అదే ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. ఓటు హక్కు కోల్పోయినట్లు చెబుతున్న 10 వేల మందిని తీసుకొని ఢిల్లీకి వెళ్లాలని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రజల్లో అనవసర భయాలు సృష్టించవద్దని సూచించారు.

సింగూరు జలాలపై కాంగ్రెస్ వైఖరేంటి..

సింగూరు జలాలను హైదరాబాద్‌కు కేటాయించడంలో తప్పేముందని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు, తమకు ఓటేసి గెలిపించిన ప్రజల పట్ల ప్రేమ ఉంటే సంగారెడ్డి ప్రాంత ప్రజల నీటి అవసరాలను ఎందుకు పట్టించుకోవడం లేదని రఘునందన్ రావు నిలదీశారు. హైదరాబాద్‌కు వివిధ మార్గాల ద్వారా నీటిని సరఫరా చేసే అవకాశాలు ఉన్నాయని, సంగారెడ్డి ప్రాంత ప్రజలకు సింగూరు జలాలే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. సింగూరు నీటిని దిగువకు ఎందుకు విడుదల చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేని ఆరోపణలు, తప్పుడు ప్రచారాల కారణంగానే కాంగ్రెస్ పార్టీ గతంలో పలుమార్లు అధికారానికి దూరమైందని, మరోసారి కూడా తన స్వయంకృతాపరాధాల వల్లే ప్రజల మద్దతు కోల్పోయే పరిస్థితి వస్తుందని రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, నాయకులు మాణిక్యరావు, కసినివాసు,దోమల విజయ్, మందుల నాగరాజు, నరేన్ దేశ్పాండే తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాధానం..!

సదాశివపేట, తెలంగాణ మంజీరా న్యూస్ :

ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడం మనిషి లకిస్యమని కాంగ్రెస్ పార్టీ సేవదళ్ జిల్లా అధ్యక్షుడు సందీప్, ఉపాధ్యక్షులు నర్సింలు అన్నారు. బుధవారం సదాశివపేట పట్టణ పరిధిలోని సిద్దాపూర్ కాలనీ వద్ద స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా రక్త ధాన శిభిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిభిరంలో జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ సేవదళ్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సేవదళ్ జిల్లా అధ్యక్షులు సందీప్ మాట్లాడుతూ రక్తదానం చేయడం మరొకరికి ప్రాణందానం చేసి ఒకరికి జీవితం కాపాడినట్లు అని, మనిషి అన్ని ధానాలకంటే రక్తదానం మహా గొప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సేవదళ్ సదాశివపేట మండల అద్యక్షులు నర్సింలు, జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ సేవదళ్ అద్యక్షులు బీరప్ప, ఉపాధ్యక్షులు ప్రవీణ్, ఝరాసంగం మండల కాంగ్రెస్ పార్టీ సేవదళ్ అద్యక్షులు లక్ష్మణ్, ఎల్గొయి రాజు, మొగుడంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు పవన్ రాథోడ్, శంకర్ గౌడ్, కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ సేవదళ్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వైపరిత్యమే... మనకు శాపమా..?

నీటి బిందువే జీవనాధారం..!

నీటి చుక్కే.. రేపటి జీవనానికి రక్ష..!

నీరు ఉంటేనే జీవం.. నీటిని కాపాడితేనే భవిష్యత్తు!

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం.. నీటిని ఆదా చేద్దాం!

వర్షాభావ పరిస్థితులపై ముందస్తు జాగ్రత్తలు అవసరం

ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి భవిష్యత్తును కాపాడుకుందాం

మంజీరా డ్యాం ఎండింది..!

నీటి సంరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు మానవ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మంజీరా డ్యాం నుండి పట్టణాలు, తాగేందుకు నీరు సరిపెడితుంది. డ్యాం సమార్థ్యం నీటి 1.5 టీఎంసీల నీల్వ ఉంటే ఇప్పుడు కనీసం నీటి చుక్కలేండా ఎండిపోయింది. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావంపై చర్చ పెరుగుతున్న వేళ నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో కారణంగా కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, దాని ప్రభావం అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండదు. వర్షాలు సమృద్ధిగా కురిసినా, వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

ఎల్‌నినో అంటే ఏమిటి?

పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు భూమధ్యరేఖ ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా మారే వాతావరణ పరిస్థితిని ఎల్‌నినో అంటారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశలు, వర్షపాత సరళులు, ఉష్ణోగ్రతలపై ప్రభావం చూపుతుంది. భారతదేశంలో రుతుపవనాలపై ఎల్‌నినో కొన్ని సందర్భాల్లో ప్రతికూల ప్రభావం చూపవచ్చు. అయితే ఎల్‌నినో ఏర్పడిన ప్రతిసారీ కరువు వస్తుందని చెప్పలేం. ఇతర వాతావరణ పరిస్థితులు కూడా వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల వాతావరణ అంచనాలతో సంబంధం లేకుండా నీటి సంరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టడం అవసరం.

నీటి కొరత.. రైతులకు పెను సవాల్

వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోతే చెరువులు, కుంటలు, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. భూగర్భ జలమట్టాలు పడిపోతే బోరుబావులపై ఆధారపడే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. పంటలకు అవసరమైన నీరు అందకపోతే దిగుబడులు తగ్గి రైతుల ఆదాయంపై ప్రభావం పడవచ్చు. పశువులకు తాగునీరు అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా చేయడం కూడా సవాల్‌గా మారవచ్చు. ఈ పరిస్థితులను నివారించాలంటే సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నీటి నిల్వలు పెంచుకునే చర్యలు చేపట్టడం మేలు.

ప్రతి ఇంట్లో నీటి పొదుపు అవసరం

నీటి సంరక్షణ అనేది ప్రభుత్వాలకే పరిమితమైన కార్యక్రమం కాదు. ప్రతి కుటుంబం తమవంతు బాధ్యతగా భావించాలి. అవసరం లేనప్పుడు కుళాయిలను తెరిచి ఉంచకూడదు. నీటి పైపుల్లో లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలి. వాహనాలు శుభ్రం చేయడం, ఇంటి పరిసరాలను కడగడం వంటి పనులకు సాధ్యమైనంత తక్కువ నీటిని వినియోగించాలి. కూరగాయలు కడిగిన నీటిని మొక్కలకు ఉపయోగించుకోవచ్చు. ఇళ్లలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. చిన్నచిన్న పొదుపు చర్యలే భవిష్యత్తులో పెద్ద నీటి సంక్షోభాన్ని నివారించేందుకు దోహదపడతాయి.

వ్యవసాయంలో నీటి వినియోగంపై అవగాహన

నీటి కొరతను ఎదుర్కొనేందుకు రైతులు పంటలకు అవసరమైన మేరకే నీటిని వినియోగించే పద్ధతులను అనుసరించాలి. సాధ్యమైన చోట బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించాలి. నేలలో తేమను కాపాడే పద్ధతులు పాటించాలి. ప్రాంతానికి అనుకూలమైన, తక్కువ నీటితో సాగు చేయగల పంటల ఎంపికపై వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలి. చెరువులు, కుంటలు, కాలువల్లో అవసరమైన పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వర్షపు నీరు వృథాగా ప్రవహించకుండా పొలాల్లో నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలి. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చు.

గ్రామాల స్థాయిలో సమష్టి కార్యాచరణ

గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలి. పాడైపోయిన నీటి పైపుల మరమ్మతులు, చెరువుల పరిరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, చెట్ల పెంపకం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. తాగునీటి వనరులు కలుషితం కాకుండా కాపాడాలి. గ్రామాల్లో నీటి వృథాను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజలకు అవగాహన కల్పించాలి. వర్షాకాలంలో కురిసే నీటిని సాధ్యమైనంత ఎక్కువగా నిల్వ చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలి. చెరువులు, కుంటలు, కాలువలు ఆక్రమణలకు గురికాకుండా వాటిని పరిరక్షించాలి. గ్రామాల్లో నీటి లభ్యత, వినియోగంపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను కొంతవరకు తగ్గుతుంది.

నీటిని వృదా చేయొద్దు..!

డ్రీమ్ సర్వీస్ అధినేత మధుగౌడ్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

ప్రజలేవ్వరు నీటిని వృధా చేయోద్దని, పొదుపుగా వాడుకోవాలని శివాని అపార్ట్మెంట్ డ్రీమ్ సర్వీస్ అధినేత రుద్రారం మధు గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు, కాలనీవాసులు ఎక్కడ కూడా నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరు ఎంతో జాగ్రత్తగా వాడుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కార ణంగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల నీటి కొరత ఏర్పడిందని తెలిపారు. రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే ప్రజ లందరూ బాధ్యతా యుతంగా వ్యవహరిం చాలని కోరారు. ఇంటి అవసరాలకు, ఇతర పనులకు నీటిని ఆదా చేసి వాడుకోవాలని, కుళాయిలను తెరిచి ఉంచడం లేదా అనవసరంగా నీటిని వృధా చేయడం వంటివి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. తాగునీటి సరఫరాలో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని పేర్కొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం..!

కౌన్సిలర్ దశరథ్ రెడ్డి

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

నీటిని పొదుపుగా వాడుకోవాలని, మంచి నీటి వృథా చేయవద్దు అంటూ సంగారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్ పోన్న దశరథ్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ ప్రజలు నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరు ఎంతో జాగ్రత్తగా వాడుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల నీటి కొరత ఏర్పడిందని తెలిపారు. రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే ప్రజలందరూ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని కోరారు. ఇంటి అవసరాలకు, ఇతర పనులకు నీటిని ఆదా చేసి వాడుకోవాలని, కుళాయిలను తెరిచి ఉంచడం లేదా అనవసరంగా నీటిని వృధా చేయడం వంటివి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. పురపాలక సంఘం తరపున తాగునీటి సరఫరాలో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా కాలనీ వాసులకు సహకరించాలని 11వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పొన్న దశథ్ రెడ్డి తెలిపారు.

గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో 'చిత్రధార గిరిజన చిత్రలేఖన శిక్షణ ప్రారంభం

పటాన్‌చెరు, తెలంగాణ మంజీరా న్యూస్ :

పటాన్‌చెరు మండల పరిధిలోని పెద్ద కంజర్ల తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ (బాయ్స్) కళాశాలలో ఏడు గిరిజన డిగ్రీ కళాశాల, గిరిజన కళాశాల విద్యార్థులకు 'చిత్రధార' పేరుతో నాలుగు రోజుల ప్రత్యేక గిరిజన చిత్రలేఖన శిక్షణా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శికె. సీతా లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ?ఈ శిక్షణా కార్యక్రమంలో ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ కి చెందిన ప్రముఖ చిత్రలేఖన నిపుణులు విద్యార్థులకు ప్రత్యక్షంగా (ప్రాక్టికల్‌గా) శిక్షణ ఇస్తున్నారు. ఈ నాలుగు రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ఒక్కో గిరిజన తెగ సంస్కృతి, కళలకు సంబంధించిన చిత్రలేఖనాన్ని నేర్పించనున్నారు. ముఖ్యంగా నాయకులు కోయ, గోండు, లంబాడీ తెగల సాంప్రదాయ ఆర్ట్ శైలులపై విద్యార్థులకు నిపుణులు కూలంకషంగా అవగాహన కల్పిస్తూ, స్వయంగా చిత్రీకరించేలా ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నారు. ?ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ గురుకుల జాయింట్ సెక్రటరీ (జీా) డి.ఎస్. వెంకన్న, డిగ్రీ కాలేజెస్ డిప్యూటీ సెక్రటరీ వేణుగోపాల్, అకాడమిక్స్ డిప్యూటీ సెక్రటరీ జి.బి. వెంకటేష్, ఓఎస్ డి (డిగ్రీ కళాశాల) నీరజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీల, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు భరోసా.. సహకార సంఘాల వద్దే వడ్లు అమ్మాలి!

-సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్-ధాన్యం విక్రయాల్లో మోసపోవద్దు.. -ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు

కొండాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :

కొండాపూర్ మండల పరిధిలోని కొండాపూర్, గొల్లపల్లి, తేర్పోల్ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ ధాన్యం కొనుగోళ్ల ద్వారా భరోసా కల్పిస్తోందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం నిర్ణయించిన సహకార సంఘాల కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అంది స్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడం ద్వారా ప్రభుత్వ మద్దతు ధరతో పాటు వర్తించే బోనస్ ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు.

రైతులకు అవసరమైన సౌకర్యాలు

ధాన్యం ఆరబెట్టుకునేందుకు రైతులకు టార్పాలిన్లు అందజేస్తున్నామని ప్రభు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ధాన్యం తూకంలో ఎలాంటి అవక తవకలు జరగకుండా, కొనుగోళ్లు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చాలని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ కొనుగోలు విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కొండాపూర్ సొసైటీ సీఈఓ సిరాజ్, సొసైటీ చైర్మన్ మాణిక్‌రెడ్డి, తలారి రాజు, నరసింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ఎన్ఎంఆర్ లక్ష్యం..!

అన్నా అంటే నేనున్నాంటు సేవ కార్యక్రమాలు

ఎన్ఎంఆర్ డివిజన్ ఇంచార్జ్ రవి ముదిరాజ్

జహీరాబాద్, తెలంగాణ మంజీరా న్యూస్ :

అన్నా అంటే నేనున్నానంటూ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పలు సేవ కార్యక్రమాలు, పేదలకు నేనున్నానని ధైర్యం చెబుతూ ఎన్ఎంఆర్ యువసేన కార్యక్రమాలు చేపడుతుందని ఎన్ఎంఆర్ జహీరాబాద్ డివిజన్ ఇంచార్జీ బొయిని రవి ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా మెదక్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ నీలం మధు ఆధ్వర్యంలో ఎన్ ఎంఆర్ యువసేన పలు సామాజిక కార్యక్రమాలు చేస్తూ పేదలకు అన్న అంటే నేనున్నాంటూ ముందుకేళు న్నామని పేర్కొన్నారు. పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, పేదలకు రేషన్ కార్డులు, 200ల యూనిట్లు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వ్యవసాయానికి సబ్సిడీ డ్రీప్, ఇందిరమ్మ ఇండ్లు తదితర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకేల్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని రవి ముదిరాజ్ తెలిపారు.

ఎడవ నిజాం కట్టిన గంగకత్వ..!

గంగ కత్వ కాలువకు రూ.37 కోట్లు

నవంబర్ లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహా, వివేక్ ల చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన

2028 జూన్ నెలలో సీఎం రేవంత్ రెడ్డి తో ప్రారంభం

11 గ్రామాలకు 3,300 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం

రైతుల అవసరాలే లక్ష్యంగా పనులు చేపడుదాం..!

గంగ కత్వ కాలువ పరిశీలన డైవ్ చేసి ఈత కొట్టిన జగ్గారెడ్డి

సదాశివపేట, తెలంగాణ మంజీరా న్యూస్ :

గంగకత్వ ప్రాజెక్టు, కాలువ ఆధునీకరణకు రూ.37 కోట్లతో గంగ కత్వ ప్రాజెక్ట్ ను పరిశీలించారు. మండలం సూరారం గ్రామంలోని గంగకత్వ ప్రాజెక్టును పరిశీలించిన ఆయన, సాగునీటి శాఖ అధికారులు, ఆయకట్టు గ్రామాల రైతులు, స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ గంగకత్వ కాలువ పరిధిలోని 11 గ్రామాల్లో 3,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. సదాశివపేట మండలంలో సుమారు 16 కిలోమీటర్ల మేర విస్తరించిన కాలువకు 28 చెరువులు అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. కాలువను ఆధునీకరించి, చివరి ఆయకట్టు వరకు నీరందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించానని తెలిపారు. రూ.37 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా లేకపోయినా రైతుల ప్రయోజనాల కోసం నిధులు తీసుకువచ్చానన్నారు. ఏడో నిజాం కాలంలో నిర్మించిన కాలువను తిరిగి ఆధునీకరించే అవకాశం రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని, కాంట్రాక్టర్ల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వొద్దని అధికారులకు సూచించారు.

వాగుపై ఏడు చెక్‌డ్యామ్‌లకు ప్రతిపాదనలు

గంగకత్వ ఆధునీకరణకు అదనంగా వాగుపై ఏడు చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని జగ్గారెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి ప్రాంతం నుంచి గంగకత్వకు వచ్చే వాగును అభివృద్ధి చేస్తే నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాగు, ప్రాజెక్టులో పూడిక తొలగింపునకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ప్రాజెక్టులో ఆరు నుంచి ఏడు అడుగుల మేర పూడిక తొలగించే అవకాశం ఉందని అధికారులు తెలపగా, సాంకేతికంగా ఎంతవరకు సాధ్యమో పరిశీలించాలని కోరారు. కొల్కూరు--నిజాంపూర్ మధ్య మంజీరా బ్యాక్‌వాటర్‌తో పంటలు మునుగుతున్నాయని రైతులు తెలిపారు. అక్కడ చెక్‌డ్యామ్ నిర్మించాలని కోరగా, సాధ్యాసాధ్యాలను పరిశీలించి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

2028 నాటికి పనుల పూర్తికి ప్రణాళిక

దీపావళి తర్వాత శంకుస్థాపన జరిగేలా చూస్తామని జగ్గారెడ్డి తెలిపారు. డిసెంబర్‌లోపు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. 2028 నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, పనులు పూర్తయ్యాక ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. డిసెంబర్‌లో మరోసారి ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షిస్తానని తెలిపారు. నిధులు, పనుల మంజూరు కోసం కృషి చేయడమే తన బాధ్యతని, శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను అధికారులు ప్రోటోకాల్ ప్రకారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి ఈ వాగుతో తనకు అనుబంధం ఉందని, తన భార్య స్వగ్రామం తాటిపల్లి కావడంతో తరచూ ఇక్కడికి వచ్చేవాడినని గుర్తు చేసుకున్నారు. పర్యటన సందర్భంగా గంగకత్వ కాలువలో జగ్గారెడ్డి ఈత కొట్టారు.

జిల్లాలో నీటి కరువు

రోజు రోజుకు తాగు నీటి సమస్య..!

ప్రకృతి వైపరీత్యం కరువు కోరలు చాచింది

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లాలో తాగునీటి సమస్య తీవ్రంగా తలెత్తింది. సింగూరు ప్రాజెక్టులో 20 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ, తాగునీటి అవసరాలకు కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే కేటాయించ బడుతోంది. దీంతో జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సింగూరు ప్రాజెక్టు నుంచి సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 3 టీఎంసీల నీటితోనే కేవలం మూడు నెలలపాటు తాగునీరు అందించగలరని అధికారులు తెలిపారు. దీంతో రాబోయే రోజుల్లో సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు తీవ్ర నీటి సమస్య ఏర్పడే ప్రమాదం ఉంది. మంజీర నది పరీవాహక ప్రాంతంలోని రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గిపోయాయి. సంగారెడ్డి పట్టణంతో పాటు ఇతర గ్రామాల్లో తాగునీటి సరఫరా కష్టమైంది. బోర్లు, బావులు ఎండిపోయాయి. ఫలితంగా గ్రామాల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితుల్లో మంత్రుల సమీక్షపై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం, అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహనీయుల విగ్రహాల వద్ద

అక్రమ కబ్జా..!

-తక్షణమే అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలి- అధికారులకు దళిత సంఘం నాయకుల వినతి

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

పట్టణంలోని మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాల వద్ద జరుగుతున్న ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. విగ్రహాల వద్ద ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని గతంలో మున్సిపల్ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినప్పటికీ, ఆ బోర్డును తొలగించి అక్రమంగా షెడ్డు నిర్మించడం పట్ల దళిత సంఘం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ నిర్మాణాలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహనీయుల విగ్రహాల వద్దనే ఆక్రమణలకు పాల్పడటం దురదృష్టకరమని, ఇది మహనీయుల ఆశయాలను గౌరవించే ప్రతి ఒక్కరిని బాధించే విషయమని నాయకులు పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుల విగ్రహాల వద్ద అక్రమ నిర్మాణాలకు తావివ్వడం సహించరానిదని స్పష్టం చేశారు. మహనీయుల విగ్రహాల వద్ద ఆక్రమణలను అడ్డుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని దళిత సంఘం నాయకులు హెచ్చరించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని తొలగించి, విగ్రహాల గౌరవాన్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

నిందితుడు జహంగీర్ కు మూడు నెలల జైలు శిక్ష

నాగర్ కర్నూల్ తెలంగాణ మంజీరా

నాగర్ కర్నూల్ జిల్లా.2016 లో బిజినేపల్లి పోలీస్ స్టేషన్ నందు నమోదు అయిన కేసు అనగా క్రైమ్ నెంబర్ 64/2016 ఖ/ం 304–వా ,338 ఐపీసీ లో నాగర్ కర్నూల్ జిల్లా కోర్టు జడ్జి నడిగట్టు శ్రీనిధి, నిందితుడు అయినటువంటి జహంగీర్ పెంట్లవెల్లి గ్రామం కు మూడు నెలల జైలు శిక్షతో పాటు వేయి రూపాయల ఫైన్ విధించడం జరిగింది.. ఈ కేసులో నిందితునికి శిక్షపడేలా కృషిచేసిన సబ్ ఇన్స్పెక్టర్ వీరబాబు రాంబాబు ఇప్పటి సబ్ ఇన్స్పెక్టర్ శంషుద్దీన్ మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి మరియు కోర్టు కానిస్టేబుల్స్ రమేష్ ఆంజనేయు లను జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు ప్రశంసించారు...